ఈనాడు సిద్దిపేట
మంగళవారం అక్టోబరు 15, 2024 5

పండగ ఆనందం ఆవిరి!



పండుగలు, సెలవులు పూర్తవడంతో గ్రామాల నుంచి పట్టణాలకు ప్రయాణమయ్యారు. సోమవారం రోజంతా సిద్దిపేట, హుస్నాబాద్ బస్టాండ్లలో రద్దీ నెలకొంది. ప్రధానంగా హైదరాబాద్, హనుమకొండ బస్సుల్లో కనీసం కాలు పెట్టడానికైనా సందు లేని పరిస్థితి నెలకొంది. అరగంటకో బస్సు వచ్చినా సరిపోలేదు. ఎక్కేటపుడు, దిగేటపుడు ప్రయాణికుల మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి. పిల్లలు, వృద్ధులు అసౌకర్యానికి గురయ్యారు.

- న్యూస్‌టుడే, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం, సిద్దిపేట టౌన్

పిల్లలు దొరికేదాకా ఉత్కంఠ



చిన్నారులు, వారి తల్లిదండ్రులతో పోలీసులు

సంతలో తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ కనిపెట్టి, పట్టుకొని అప్పగించేంత వరకు ఓవైపు పోలీసులు, మరోవైపు తల్లిదండ్రులు ఉత్కంఠకు గురయ్యారు. చివరికి సురక్షితంగా అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మర్కూక్ ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాలు.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండల కేంద్రంలో బిహార్ రాష్ట్రానికి చెందిన కొందరు తమ పిల్లలతో కలిసి ఉంటున్నారు. ఆదివారం మర్కూక్ మండలం కర్కపట్లలో జరిగిన సంతకు పిల్లలతో కలిసి వచ్చారు. అక్కడ ఇద్దరు చిన్నారులు తప్పిపోవడంతో పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ రవీందర్, మహిళ కానిస్టేబుల్ జ్యోతి ఆధ్వర్యంలో వెతకగా దామరకుంట సమీపంలో రహదారిపై వెళ్తున్న బాలలు కనిపించారు. తల్లిదండ్రులను పిలిపించి వారిని అప్పగించారు.


- న్యూస్‌టుడే, ములుగు

మన చేతుల్లోనే ఆరోగ్యం

● సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక మొదలు ఐదో తరగతి వరకు 94 మంది చదువుతున్నారు. నిత్యం ఉదయాన్నే ప్రార్థన సమయంలో చేతుల శుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ద్రావణాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. పిల్లల ఆరోగ్యానికి ఇలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని హెచ్ఎం సయ్యద్ సంధాని చెబుతున్నారు. వంట నిర్వాహకుల విషయంలోనూ ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.



చేతుల శుభ్రతపై వివిధ వర్గాలకు చెందిన 200 మందితో 'న్యూస్‌టుడే' బృందం సర్వే నిర్వహించగా ఇలా స్పందించారు.





బక్రిచెప్యాల ప్రాథమిక పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ సంధాని

న్యూస్‌టుడే, సిద్దిపేట

జిల్లాలో ఇలా..
- జనాభా: 10.12 లక్షలు
- అన్ని రకాల విద్యాలయాలు (1-12వ తరగతి వరకు): 1318
- విద్యార్థులు: 1.74 లక్షలు

ఆరోగ్యమే మహాభాగ్యం. ఇందుకు ప్రతీ అంశం కీలకమే. దినచర్యలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే.. సురక్షిత జీవనం సొంతం అవుతుంది. చేతుల శుభ్రత అత్యంత ప్రాధాన్యంతో కూడుకుంది. తద్వారా ఎన్నో రోగాల నుంచి కాపాడుకో వచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇటీవల ఆరోగ్య స్పృహ పెరిగినా.. విద్యాలయాల్లో కచ్చితంగా అమలు చేయాలి. నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా సిద్దిపేటకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా. రామ్మోహన్ ఇలా వివరించారు.



అపరిశుభ్రతతో..

అనారోగ్యానికి కారణం. చిన్నారుల్లో అవగాహన లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఒకప్పటితో పోలిస్తే కొంత మార్పు కనిపిస్తోంది. విద్యాసంస్థల్లో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంది. అత్యధిక చోట్ల నీటి వసతి ఉన్నా సబ్బు లేదా ద్రావణాలు ఉంచడం లేదు. మధ్యాహ్న భోజనం, స్నాక్స్ తినే ముందు, ఆడినప్పుడు, శౌచాలయానికి వెళ్లినప్పుడు మాములుగా శుభ్రం చేసుకుంటున్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు దీనిపై శ్రద్ధ వహించాలి. గ్రామాల్లో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.

● భోజనానికి ముందు చేతుల శుభ్రత తప్పనిసరి. ఒక నిమిషం ఇందుకు కేటాయించాలి. ● దగ్గినా, తుమ్మినా విస్మరించొద్దు. ● మల, మూత్ర విసర్జన తర్వాత కాళ్లు, చేతులు కడుక్కోవాలి. ● పాఠశాలల్లో ద్రావణం లేదా సబ్బును అందుబాటులో ఉంచాలి. ● ఉంగరాలు పెట్టుకునే చేతి వేళ్లను ఎక్కువ శుభ్రం చేయాలి. ● వైరస్, బ్యాక్టీరియాలు ఒంట్లోకి చేరేందుకు చేతులే వాహకాలు. కళ్లు, ముక్కు, నోటిని తరచూ చేతులతో తాకే ప్రయత్నం చేయొద్దు. ● చేతుల శుభ్రత అలవాటుగా మారితే అనారోగ్య సమస్యల నుంచి 90 శాతం భద్రంగా ఉన్నట్టే.

బాధ్యత వహిస్తే..

సబ్బు లేదా ద్రావణంతో చేతుల శుభ్రతతో అతిసారం 30 శాతం, శ్వాసకోశ వ్యాధులను 20 శాతం వరకు నివారించవచ్చు. కలరా, ఎబోలా, హెపటైటిస్-ఈ తదితర వాటి కారకాల వ్యాప్తిని అడ్డుకోవచ్చు. కడగకుండా అల్పాహారం, ఆహారం తీసుకుంటే హానికర క్రిములు పొట్టలో చేరే అవకాశం మెండు. కొన్ని సందర్భాల్లో టైఫాయిడ్, కడుపునొప్పి, విరేచనాల బారిన పడుతుంటారు. తల్లిదండ్రులు బాధ్యతగా బాల్యంలోనే అవగాహన కల్పించాలి.

అలవాటు చేస్తూ..



అక్కన్నపేట మండలం చౌటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో హ్యాండ్‌వాష్, సబ్బు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు ధరావత్ మొగిలి పక్కాగా పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులకు దీన్ని అలవాటుగా మారుస్తున్నారు. అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన నల్లాలను త్వరలోనే ప్రారంభించనున్నారు.

- న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం.

మల్లన్న సేవలో ఎమ్మెల్యే గాంధీ



మల్లన్న చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు, నాయకులు

చేర్యాల, న్యూస్‌టుడే: చేర్యాల మండలం కొమురవెల్లి మల్లికార్జునస్వామిని శేర్‌లింగంపల్లి ఎమ్మెల్యే, ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిబ్బంది, అర్చకులు ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఆంజనేయులు, నర్సింహులు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి 29 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీఓ జయదేవ్‌ఆర్య, డీఆర్వో నాగరాజమ్మ

సిద్దిపేట టౌన్, బెజ్జంకి, న్యూస్‌టుడే: సమీకృత కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 29 దరఖాస్తులు వచ్చాయి. సంబంధిత శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి వాటిని బదిలీ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని గూడెంలో భూ పంపిణీ పథకం కింద అనర్హులకు భూములు కేటాయించారని, విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. 2017లో భూములు ఉన్నవారికే లబ్ధి కలిగించారని తెలిపారు.

సౌకర్యాల కల్పనతో ఇబ్బంది లేని కొనుగోలు



అప్పనపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

దుబ్బాక, తొగుట, మిరుదొడ్డి, రాయపోల్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, వారికి ఇబ్బంది కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియను అధికారులు పూర్తి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ధర్మారం, అప్పనపల్లి, గోవిందాపూర్, రాయపోల్ తదితర గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించారు. సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య ఏపీడీ మధుసూదన్, డీపీఎం రాజయ్య, ఏపీఎం కృష్ణారెడ్డి, సీసీలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, భారాస నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కవర్లు, వాహనాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. భారాస ప్రభుత్వ హయాంలో నిర్మించిన రంగనాయక సాగర్, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల కాలువలు, భూగర్భ జలాల పెంపు ద్వారా నేడు రైతులు అత్యధికంగా వరి పంట దిగుబడి సాధిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా అభివృద్ధి కార్యక్రమాలకు వస్తే.. కాంగ్రెస్ వారు అడ్డుకుంటామనడం విడ్డూరంగా ఉందన్నారు.

కాంగ్రెస్, భారాస నాయకుల మాటల తూటాలు

దౌల్తాబాద్: గోవిందాపూర్‌లో భారాస నాయకులు కొబ్బరికాయలు కొట్టి కేంద్రాల ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని కాంగ్రెస్ నేతలు తప్పుబట్టారు. ప్రొటోకాల్ గురించి మాట్లాడిన ఎమ్మెల్యేకు ఆ విషయంపై పట్టింపులేదా అని ప్రశ్నించారు. భారాస, కాంగ్రెస్ నాయకుల మధ్య మాటా మాటా పెరగడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు వచ్చి నాయకులను సర్ది చెప్పి పంపించారు. ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమాల వద్ద బందోబస్తు కోసం పోలీసులు భారీగా మోహరించారు. ఏసీపీ మధు, సీఐలు లతీఫ్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఆశల పల్లకిలో 'సాదాబైనామా'



న్యూస్‌టుడే, గజ్వేల్, సిద్దిపేట: దశాబ్దాల కాలం కిందట సాదాబైనామాల (కాగితాలపై ఒప్పందాలు రాసుకుని) రూపంలో కొనుగోలు చేసిన భూముల పట్టామార్పిడి సమస్య ఎప్పుడు తీరుతుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు. సాదాబైనామాలను క్రమబద్ధీకరిస్తామని చెప్పటంతో గత ప్రభుత్వ హయాంలోనే అధికారులు దరఖాస్తులు స్వీకరించినా వాటికి మోక్షం లభించలేదు. సాగులో కొనుగోలుదారులు ఉంటున్నారు. పట్టాల్లో మాత్రం సొంతదారుల పేర్లు వస్తున్నాయి. ఇది గ్రామాల్లో గొడవలకు కారణమవుతుంది. రికార్డుల్లో పేరు లేకపోవటంతో ప్రభుత్వ పథకాలు అందకుండాపోతున్నాయి.

రెవెన్యూ డివిజన్	పెండింగ్ దరఖాస్తులు
గజ్వేల్	6,280
హుస్నాబాద్	10,316
సిద్దిపేట	26,590

పరిష్కరిస్తే పట్టా పుస్తకాలు

కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్) 2024 బిల్లు ముసాయిదాలో సాదాబైనామాల అంశాన్ని చేర్చుతోంది. ఈమేరకు రైతుల్లో ఆశలు చిగురించాయి. 2014 జూన్ 2 వరకు సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూములను కొనుగోలుదారుల పేర్ల మీదికి పట్టా మార్పిడి చేసి పాసుపుస్తకాలు జారీ చేయాలని నిర్ణయించినప్పటికీ దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదు. దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్నవారు తమ పేర్లను రికార్డుల్లోకి ఎప్పుడు ఎక్కిస్తారోనని ఎదురుచూస్తున్నారు. ధరణి సమస్యల పరిష్కారానికి ఆర్వోఆర్ చట్టం తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వివిధ భూ సమస్యలతోపాటు సాదాబైనామాలను సెక్షన్-6లో చేర్చటంతో కొనుగోలుదారులు ఆశలు పెట్టుకున్నారు. త్వరగా పట్టాపాసు పుస్తకాలు జారీ చేస్తే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందుకోవాలని ఆతృతతో ఎదురుచూస్తున్నారు.

అన్నదాతలకు ఇబ్బందులివి
- భూమిపై హక్కులు ఉండటం లేదు.
- రైతు భరోసా, బీమా, పంట రుణం రావు.
- ధాన్యం విక్రయిస్తే వచ్చే నగదు జమ కాదు.
- పట్టా పాసుపుస్తకాలు లేవు.

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి



రమేశ్

దుబ్బాక, న్యూస్‌టుడే: రెండు రోజుల క్రితం చేపలు పట్టేందుకు వెళ్లి, అదృశ్యమైన జాలరి మృతదేహాన్ని చెరువు నుంచి వెలికితీశారు. దుబ్బాక ఎస్సై వి. గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణానికి చెందిన పెంటం రమేశ్(35) చేపలు పట్టడంతో పాటు, పానీపూరి బండి నిర్వహిస్తూ, భార్య రూప, ఆరేళ్ల కుమారుడితో కలిసి జీవిస్తున్నారు. ఈ నెల 12న చేపల వేటకని ఇంట్లో చెప్పి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఎంతకీ భర్త తిరిగి రాకపోవడంతో, 13వ తేదీ సాయంత్రం దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది. సోమవారం మధ్యాహ్నం పట్టణ శివారులో దుంపలపల్లికి వెళ్లే మార్గంలోని ఎదుల్ల చెరువు సమీపంలో రమేశ్ ద్విచక్ర వాహనాన్ని, చెప్పులను స్థానిక జాలరులు గుర్తించారు. చెరువులో గాలింపు చేపట్టి రమేశ్ మృతదేహాన్ని గుర్తించారు. చేపల కోసం చెరువులో దిగిన రమేశ్ వలలో చిక్కుకొని ఊపిరాడక మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీసి, శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు.

స్నానం చేసేందుకు నీటిలో దిగి..



రాములు

వర్గల్, న్యూస్‌టుడే: స్నానం చేసేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయి మృతి చెందాడు. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. వర్గల్ మండలం తునికిమక్త గ్రామానికి చెందిన సుండు రాములు(58) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. ఇటీవల తమ వర్గానికి చెందిన ఒకరు చనిపోవడంతో ఆదివారం దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని అంసోనికుంట చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన రాములు తిరిగి ఇంటికి రాలేదు. రాత్రి వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం చెరువులో మృతదేహాన్ని గుర్తించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తూ మురుగు కాల్వలో పడి..



శంకర్

దుబ్బాక, న్యూస్‌టుడే: మూత్ర విసర్జన చేస్తుండగా, ప్రమాదవశాత్తు మురుగు కాల్వలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. దుబ్బాక ఎస్సై వి.గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పురపాలికలోని లచ్చపేట 10వ వార్డుకు చెందిన పూస శంకర్(55) గ్రామంలో చేపలు విక్రయిస్తూ, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఆదివారం దుబ్బాకకు వెళుతున్నానని సైకిల్‌పై బయలుదేరాడు. భార్యా పిల్లలు దుంపలపల్లి వార్డులో బంధువుల ఇంట్లో సంవత్సరీకానికి వెళ్లారు. సాయంత్రం దుంపలపల్లికి బయలుదేరిన అతను దుబ్బాక పట్టణ శివారులో టీటీడీ కల్యాణ మండపం వద్ద రోడ్డు పక్కన పెద్ద మురుగు కాల్వలో మూత్ర విసర్జన చేస్తూ అందులో పడిపోయాడు. ముఖానికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రయినా భర్త రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. సోమవారం ఉదయం స్థానికులు మురుగు కాల్వలో మృతదేహాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వద్ద లభ్యమైన వివరాల ఆధారంగా శంకర్‌గా గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డుపై వృద్ధుడి మృతదేహం

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ వృద్ధుడు రహదారిపై పడి మృతి చెందాడు. గజ్వేల్ అదనపు సీఐ ముత్యంరాజు తెలిపిన వివరాలు.. గజ్వేల్ పట్టణానికి చెందిన రాజుల్ల హరినాథ్(62) సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఓ మద్యం దుకాణం సమీపంలో రహదారిపై పడిపోయి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



తోటపల్లిలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి: ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బెజ్జంకి, తోటపల్లిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

భూ అక్రమాలపై చర్యలు తీసుకోండి

తూప్రాన్: మెదక్ జిల్లా పోతరాజ్‌పల్లిలోని ఓ మీ-సేవా కేంద్రం నిర్వాహకుడితో కలిసి తూప్రాన్ రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు రావెల్లికి చెందిన గణేశ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 438 సర్వే నంబరులోని 8 గుంటల భూమిని తన పేరిట రికార్డులో రాయించుకున్నారని ఫిర్యాదు చేశారు. 445 సర్వే నంబరులో 30 గుంటల అసైన్డ్ భూమిని.. 5.17 ఎకరాలకు పెంచి సొమ్ము చేసుకున్నారని తెలిపారు. విచారణ చేపట్టి నివేదించాలని అధికారులకు ఫోన్ చేసి కలెక్టర్ ఆదేశించారు.

అప్రమత్తతతో సురక్షితం

ఈ ఏడాది ఇప్పటి వరకు 275 పాము కాటు ఘటనలు



● సిద్దిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్ గ్రామంలో ఈ నెల 3న తల్లితో కలిసి బీడీ కంపెనీకి వెళ్లిన ఏడేళ్ల బాలుడు అక్కడి అట్టలను తీయగా పాము కాటేసింది. ఏడుస్తున్న బాలుడిని చూసి ఏదో గుచ్చుకుందని భావించారు. ఇంతలోనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చగా మృతి చెందాడు.

● గత నెల 20న దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామానికి మహిళా కూలీ మొక్కజొన్న కంకులు తీసేందుకు వెళ్లింది. అక్కడ ఆమెను పాము కాటేసింది. గమనించిన మహిళా వారికి సూచించడంతో ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగానే చనిపోయింది. 108 వాహన సిబ్బంది వచ్చి ధ్రువీకరించారు.

సిద్దిపేట అర్బన్, సిద్దిపేట, న్యూస్‌టుడే: విష సర్పాల బారిన పడి పలువురు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ముఖ్యంగా పొలాల వద్ద ఎక్కువగా ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రైతులు, కూలీలు అధికంగా విష కీటకాలు, జంతువుల బారిన పడుతున్నారు. వెంటనే విషయాన్ని గ్రహించి ఆసుపత్రికి చేరితేనే ప్రాణాలు దక్కుతున్నాయి. పాముకాటును గుర్తించలేకపోవడం, వెంటనే చికిత్స అందకపోవడంతో కొందరు చనిపోతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు 13 వరకు 275 మంది పాము కాట్లకు గురయ్యారు. పాము కాటు విరుగుడుకు వినియోగించే ఇంజక్షన్ మందులు జిల్లాలో 636 వరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. విష సర్పాలు కాటేస్తే ఆందోళన చెందవద్దని పుల్లూరు వైద్యుడు ఉదయ్‌కుమార్ చెప్పారు. కరిచిన ప్రాంతాన్ని కదిలించకూడదన్నారు. కరిస్తే నాడీ వ్యవస్థపై, రక్త సరఫరాపై ప్రభావాన్ని చూపుతాయన్నారు. వేగంగా వైద్యం అందించాలన్నారు. మన ప్రాంతంలోని తాచుపాము, రక్తపింజర, కట్ల పాము మాత్రమే ప్రమాదకరమైనవని తెలిపారు.

జాగ్రత్తలు
- కాటు పడిన చోట సబ్బుతో శుభ్రం చేయాలి.
- గాయంపై వదులుగా కట్టుకట్టాలి.
- అవకాశం ఉంటే ఏరకం పామో తెలుసుకోవాలి.
- త్వరగా ఆసుపత్రికి చేరుకునేలా చూసుకోవాలి.
- నాటు వైద్యం చేయొద్దు.
- పొలంలో పనిచేసేవారు మోకాళ్ల వరకు బూట్లు ధరిస్తే మంచిది.
- నివాస ప్రాంతాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.

'శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి'



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. భాస్కర్, రవికుమార్, ప్రవీణ, మంజుల తదితరులు ఉన్నారు.

ప్రైవేటు కళాశాలల నిరవధిక బంద్!

సిద్దిపేట: మూడేళ్లుగా బోధనా రుసుము బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ బాట పట్టాయి. సోమవారం నుంచి నిరవధిక మూసివేతకు నిర్వాహకులు నిర్ణయించారు. జిల్లాలోని 10 కళాశాలలు మూసివేసి ఉన్నాయి. నిర్వాహకులు మాట్లాడుతూ.. మూడేళ్లుగా బోధనా రుసుము విడుదల చేయకపోవడంతో రూ.కోట్లలో రుణాల పాలయ్యామని, నిర్వహణ అసాధ్యంగా మారిందన్నారు. తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం పిలుపు మేరకు నిరసన బాట పట్టాల్సి వచ్చిందన్నారు. దసరా సెలవుల అనంతరం పునఃప్రారంభం కావాల్సి ఉండగా బంద్ నేపథ్యంలో తెరుచుకోలేదు. విద్యార్థులు అయోమయానికి గురయ్యారు.

ఎంపికైన ఉపాధ్యాయులకు నేడు కౌన్సెలింగ్

సిద్దిపేట: జిల్లాలో డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 15న సిద్దిపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి అన్ని సబ్జెక్టుల ఎస్ఏ (తెలుగు, ఉర్దూ మాధ్యమం), ఎస్జీటీలు(ఉర్దూ), ఎల్పీ (తెలుగు, హిందీ), డీఈడీ, పీఈటీలకు మధ్యాహ్నం 2 గంటలకు ఎస్జీటీ (తెలుగు మాధ్యమం) అభ్యర్థులకు ప్రక్రియ చేపడతామన్నారు.

30 వరకు సిటీ పోలీసు చట్టం అమలు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పోలీసు కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి అక్టోబరు 30వ తేదీ ఉదయం 6 గంటల వరకు సిటీ పోలీసు చట్టం యథావిధిగా అమలులో ఉంటుందని సీపీ అనురాధ ప్రకటించారు. ధర్నా, ర్యాలీ, రాస్తారోకో, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు. ఒకవేళ నిర్వహించాల్సి వస్తే పోలీసు అధికారుల ముందస్తు అనుమతి పొందాలని పేర్కొన్నారు. బందుల పేరిట బలవంతంగా మూసివేయించొద్దని తెలిపారు.


వాహనాలకు సైరన్ల తొలగింపు



సీపీ అనూరాధకు మొక్క అందిస్తున్న సీఐ వాసుదేవరావు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ అనుమతి లేకుండా వాహనాలకు పోలీస్ సైరన్ ఏర్పాటు చేసుకుంటే అలాంటి వాటిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని పోలీసు కమిషనర్ అనూరాధ హెచ్చరించారు. జిల్లాలో కొంత మంది ప్రజాప్రతినిధులు పోలీసు సైరన్లు బిగించుకున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు కమిషనరేట్ పరిధిలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 22 వాహనాల సైరన్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎవరు కోరినా కార్ డెకార్ దుకాణదారులు వాటిని బిగించవద్దన్నారు. పోలీసు, జర్నలిస్టు కాకపోయినా పోలీస్, ప్రెస్ అని వాహనాలపై రాసుకొని తిరుగుతున్నారని.. చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. సిద్దిపేట వన్‌టౌన్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వాసుదేవరావు కమిషనరేట్‌లో సీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. సైబర్ నేరాలు, గంజాయి, మత్తుపదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఐకి సూచించారు.

తరుణీ.. శక్తిస్వరూపిణి



గ్రామీణ మగువ.. కొంగు నడుముకు బిగించి పొలంలో పంట పండించి రైతుగా అన్నం పెడుతోంది. ఉపాధి హామీ పథకంలో స్వేదాన్ని చిందించి గ్రామీణ వలసల నిరోధానికి చోదకశక్తిగా నిలుస్తోంది. పాడిపై ఉద్యమానికి హారతి పడుతోంది.. రుణాలతో స్వయం ఉపాధికి బాటలు వేసుకొని ఆర్థిక స్వావలంబనకు ప్రతీకగా నిలుస్తోంది.. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన గ్రామీణ మహిళలు నేడు శక్తిగా మారి అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తుండటం విశేషం. నేడు 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం' నేపథ్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సమస్యలు అధిగమించి విజయాలు సాధించిన వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

నేడు ప్రపంచ గ్రామీణ మహిళా దినోత్సవం

	మహిళలు (లక్షల్లో..)	పొదుపు సంఘాలు	సభ్యులు (లక్షల్లో..)
సంగారెడ్డి	4.90	18,208	1.91
సిద్దిపేట	4.47	18,274	1.94
వికారాబాద్	4.26	15,525	1.62
మెదక్	3.88	13,061	1.37

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట, మెదక్, వికారాబాద్ కలెక్టరేట్

ప్రధాని నుంచి సత్కారం

వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్‌కు చెందిన కంతి లక్ష్మి జాతీయస్థాయిలో ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ఎంపికై గ్రామీణ మహిళ ఎందరికో తక్కువ కాదని నిరూపించారు. జనవరి 26న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పారిశుద్ధ్య కార్మికురాలిగా గ్రామం స్వచ్ఛంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించారు. ఈమె చిత్తశుద్ధిని గమనించిన అధికారులు ఆమెను ఎంపిక చేశారు. ఈమె భర్త కంతి సైదప్ప. వీరికి ఎకరం పొలం ఉంది. మూడేళ్ల క్రితం భర్త అనారోగ్యం పాలవడంతో ఆయన స్థానంలో ఉద్యోగంలో చేరారు. రోజూ తడి, పొడి చెత్త వేరు చేయడం.. ఇనుము, గాజు అమ్మకం ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చేలా చేస్తున్నారు. వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువుగా మార్చడం వంటి పనులు నిర్వహిస్తారు. – న్యూస్‌టుడే, కొడంగల్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో లక్ష్మి

అతివలకు అండగా నిలుస్తూ..

ఆమె చదివింది ఐదో తరగతే. అయినా తనవంతుగా ఏదైనా చేయాలన్న సంకల్పంతో ఆడవారికి నిస్సహాయులకు అండగా నిలుస్తున్నారు. ఆమే నర్సాపూర్ మండలం లింగాపూర్‌కు చెందిన చింతల లక్ష్మి. కొన్నాళ్ల కిందట గ్రామంలో భవానీ శ్రీ స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటుచేశారు. స్థానిక మహిళలకు అవగాహన కల్పించి సంఘంలో చేర్పించి పొదుపు బాట పట్టించారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవడంపై చైతన్యం తీసుకొస్తూ ఎంతోమందిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారు. ఇలా జిల్లా స్థాయి కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్‌గా ఎదిగారు. ఉమ్మడి జిల్లా సమాఖ్యకు అధ్యక్షురాలిగా సైతం పని చేశారు. మరోవైపు అక్షరాస్యత పెంచేందుకు గ్రామీణ మహిళలకు చదువు నేర్పించారు. గ్రామాల్లో సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఐకేపీ జెండర్ పాయింట్ పర్సన్‌గా పనిచేస్తున్నారు. దంపతుల మధ్య వివాదాల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నర్సాపూర్



చింతల లక్ష్మి

వీఓఏ నుంచి పారిశ్రామికవేత్తగా..

హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బోయిని కనకతార వీఓఏగా పని చేస్తూనే వ్యాపారంలో రాణిస్తున్నారు. స్వయం సహాయక బృంద సభ్యురాలి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి ఆదర్శంగా నిలిచారు. అరుంధతి సంఘం సభ్యురాలిగా అడుగిడిన ఈమె 2005 నుంచి వీఓఏ(సీఏ)గా పని చేస్తున్నారు. 2012లో టైలరింగ్ యూనిట్ ఏర్పాటుచేశారు. 40 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. తర్వాత రూ.కోటితో వేర్వేరు జిల్లాల్లో వస్త్ర సంచులు, పళ్లేల తయారీ యూనిట్లనూ నెలకొల్పారు. ఈ నెల 17న దిల్లీలో జరిగే జాతీయస్థాయి పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్ల సదస్సులో పాల్గొనే అవకాశాన్ని అందుకున్నారు. – న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం



వస్త్ర సంచుల తయారీలో కనకతార

ఇటు పొలం.. అటు చిత్రీకరణ



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం హుమ్నాపూర్‌కు చెందిన లక్ష్మమ్మ చిన్నతనం నుంచి వ్యవసాయ కూలీగా పని చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో జహీరాబాద్‌కు చెందిన దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్)లో చేరిన తర్వాత ఈమె జీవితం మలుపు తిరిగింది. సంస్థ నిర్వాహకుల ప్రోత్సాహంతో వీడియో చిత్రీకరణ నేర్చుకున్నారు. 35 ఏళ్లకు పైగా పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వీడియోలను తీసి గుర్తింపు దక్కించుకున్నారు. 52 ఏళ్ల ఈ మహిళ సేంద్రియ విధానంలో చిరుధాన్యాల సాగు చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో విత్తనాలను నిల్వ చేస్తూ సంస్థకు, రైతులకు అందిస్తున్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు 11కు పైగా దేశాల్లో పలు సమావేశాలను చిత్రీకరించారు. – న్యూస్‌టుడే, జహీరాబాద్

క్రీడాకారిణులను తీర్చిదిద్దుతూ..



సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మాటిండ్లకు చెందిన భాగ్యమ్మ.. ఫుట్‌బాల్ శిక్షకురాలిగా ఎంతో మంది క్రీడాకారిణులను తీర్చిదిద్దుతున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈమె హకీంపేట క్రీడా పాఠశాలలో శిక్షణ పొందారు. రాష్ట్ర స్థాయిలో 6 స్వర్ణ పతకాలు సాధించారు. 12 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో నిత్యం 80 మంది విద్యార్థినులకు మెలకువలు నేర్పిస్తున్నారు. ఈమె పర్యవేక్షణలో శిక్షణ పొందిన సీనియర్ మహిళా జట్టు గత నెలలో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఫైనల్‌కు చేరుకుంది. తాజాగా మెదక్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. – న్యూస్‌టుడే, మెదక్ టౌన్

జాతీయ యోగా పోటీలకు ఎంపిక



మాధవి, శాకేర

కొండాపూర్: జాతీయ స్థాయి యోగా పోటీలకు కొండాపూర్ మండలం గంగారం ఉన్నత పాఠశాల విద్యార్థులు మాధవి, శాకేర ఎంపికయ్యారని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, రమేశ్ సోమవారం తెలిపారు. పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారన్నారు. నవంబరు 11 నుంచి 14 వరకు అస్సాంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు.

కథ రాసి.. బహుమతి దక్కించుకొని..



ప్రహర్ణి

సిద్దిపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీల్లో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రహర్ణి ప్రతిభ కనబర్చారు. విద్యార్థిని రాసిన 'సాహసం' కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 232 కథల్లో 28 వివిధ విభాగాల్లో ఉత్తమంగా నిలిచాయి. వాటిలో ప్రహర్ణి రాసిన కథ ఒకటవడం విశేషం. నవంబరు 3న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం ప్రదానం చేయనున్నారు. ఆమెను హెచ్‌ఎం షౌకత్‌అలీ, ఉపాధ్యాయులు అభినందించారు.



న్యాల్‌కల్ బసవన్నకు జాతీయస్థాయి గుర్తింపు

జహీరాబాద్ అర్బన్(న్యాల్‌కల్), న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు హోతి బస్వరాజు రూపొందించిన 'మాడ్రన్ హస్బెండ్రీ' కళాకృతి జాతీయస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి దక్కించుకుంది. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 'ఇండియన్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' నిర్వహించే 'ఆల్ ఇండియా ఎగ్జిబిషన్ ఆఫ్ ఆర్ట్స్-2024' పోటీల్లో దీన్ని ప్రదర్శించారు. ఈనెల 26న బస్వరాజు పురస్కారం అందుకోనున్నారు.

నూతన ఆవిష్కరణలే లక్ష్యం

ఐఐటీహెచ్-కెన్యా బృందం ఒప్పందం



ఐఐటీహెచ్‌లో కెన్యా బృందం సభ్యులు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: కెన్యా నేషనల్ ఇన్నోవేషన్ ఏజెన్సీ బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా ఐఐటీహెచ్‌ను సోమవారం సందర్శించింది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇండియా-కెన్యా ఇన్నోవేషన్ నెక్సస్ పేరుతో రూపొందించిన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కెన్యా పార్లమెంట్ సభ్యులు ఎదిత్ వెతి నైన్జ్, అమినా దికా అబ్దుల్లాహితోపాటు 11 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తాజాగా కుదుర్చుకున్న ఒప్పందంతో ఇరు దేశాలకు ప్రయోజనం చేకూరనుందన్నారు. సాంకేతిక, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రంగాల్లో సంయుక్త పరిశోధనలకు మార్గం సుగమం కానుందని పేర్కొన్నారు.

అబ్దుల్‌కలాంకు చిత్ర నివాళి

భారత క్షిపణి పితామహుడు, ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రజ్ఞుడు, భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని మంగళవారం జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పత్రచిత్రకారుడు గుండు శివకుమార్ ఎండిన రావి ఆకులపై మిస్సైల్ మ్యాన్ చిత్రాలు, పచ్చి ఆకులపై కలాం చిత్రాలు, అరచేతిలో, చేతివేలి గోర్లపై కలాం చిత్రాలు, కాగితంపై క్షిపణి, కలాం వివిధ వయస్సులోని చిత్రాలను మలిచి చిత్ర నివాళులు అర్పించారు.

– న్యూస్‌టుడే, నారాయణఖేడ్



సాహిత్యంతో సమాజంలో మార్పు సాధ్యం



శ్రీయశస్విని గ్రంథం విడుదల చేస్తున్న కవులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మంచి మాటలు, సాహిత్యం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమని ప్రముఖ కవి, అవధాన విద్యాపీఠం అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయశర్మ అన్నారు. సిద్దిపేటలోని వ్యాసమహర్షి యోగా కేంద్రంలో సోమవారం శ్రీయశస్విని గ్రంథ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. పద్యం ప్రాచీనమైన ప్రక్రియ అయినా నిత్యనూతనంగా, ఉత్తేజితంగా సమాజానికి చేరుతుందన్నారు. 180 మంది కవులతో ఏక మకుటంతో 1800లకు పైగా పద్యాలు చదివే అవకాశం శ్రీయశస్విని గ్రంథం ద్వారా లభించటం సంతోషకరమన్నారు. కవులకు, కళాకారులకు పుట్టినిల్లు సిద్దిపేట అన్నారు. పుస్తక సంపాదకులు, అవధాని డా. బోచ్కర్ ఓంప్రకాశ్ మాట్లాడుతూ.. శ్రీయశస్విని గ్రంథంలోని ప్రతీపద్యం జనజీవనంలోని అంశాలను గుర్తు చేస్తాయన్నారు. కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ల రాజేశం, సాయిప్రసాద్, ఎన్నవెల్లి రాజమౌళి, సతీష్, రాజ్‌కుమార్, జబర్దస్త్ లక్ష్మీకిరణ్, సింగితం నరసింహారావు, లక్ష్మయ్య, రంజిత్‌కుమార్, ఫణీంద్ర, లక్ష్మి పాల్గొన్నారు.



చికెన్ ధరలు			
ఫాంరేటు	126–00	డ్రెస్డ్	215–00
రిటైల్	148–00	స్కిన్‌లెస్	244–00



సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్య రక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయ కర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం: 93815 15588

ప్రశ్న: బెండ తోటకు పచ్చదోమ ఆశించింది. ఏం చేయాలి? – విజయ్, కొండాపూర్

సమాధానం: పచ్చదోమ కాయలను తినేసి నష్టపరుస్తుంది. ఇమిడాక్లోప్రిడ్ 1 మి.లీ... లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, చేర్యాల

చేపల ఎదుగుదలకు పొటాషియం పర్మాంగనేట్

చేపల పెంపకంలో పలు రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. చెరువుల్లో సున్నం, సాధారణ ఉప్పు, పొటాషియం పర్మాంగనేట్, కాపర్ సల్ఫేట్ వినియోగించడం మంచిది. సున్నం నీటి నాణ్యతను మెరుగుపరుస్తుంది. పొటాషియం పర్మాంగనేట్ చేపల్లో వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. కాపర్ సల్ఫేట్‌తో ఫంగస్, శంకుపూత వ్యాధులను అరికట్టవచ్చు. ఇక ప్రోటోజోవన్, క్రస్టేషియన్ పరాన్నజీవుల నిర్మూలనకు ఉపయోగపడుతుంది.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

సెనగ సాగు.. సమయం ఆసన్నం!

న్యూస్‌టుడే, చేర్యాల





విజయ్

పప్పు దినుసులకు ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. వాటిలో కంది తర్వాత సెనగ పప్పుది రెండో స్థానం. అయితే సెనగ సాగుకు ప్రస్తుతం అనుకూలమైన సమయం. ముఖ్యంగా నల్లరేగడి భూముల్లో దీన్ని సాగు చేస్తే అధిక దిగుబడులు సాధ్యమని సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జక్కుల విజయ్ సూచిస్తున్నారు. వివరాలు ఇలా..

అక్టోబరు- నవంబరు నెలల్లో సెనగ సాగు చేయవచ్చు. నల్లరేగడి నేలలు అనుకూలం. ఈ నేలల్లో నిల్వ ఉండే తేమను ఉపయోగించుకుంటూ మొక్కలు పెరుగుతాయి. చౌడు నేలలు పనికి రావు. తొలకరిలో వేసిన పైరును కోసిన తర్వాత భూమిని నాగలితో ఒకసారి, గొర్రుతో రెండుసార్లు మెత్తగా దున్ని చదును చేసుకోవాలి.

రకాలు, మోతాదు..

జె.జి.11, జె.ఎ.కె.ఐ.9218, కె.ఎ.కె.2, క్రాంతి(ఐ.సి.సి.37), శ్వేత(ఐ.సి.సి.వి.2), అన్నెగిరి, జ్యోతి, ఐ.సి.సి.వి.10 రకాలు మేలైనవి. వీటన్నింటి పంట కాలం 90-110 రోజులు. ఎకరాకు 6-10 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. ఎకరాకు 30-40 కిలోల విత్తనం అవసరం. విత్తనశుద్ధి తప్పనిసరి.


ఎరువులు, నీటి యాజమాన్యం..


ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల గంధకాన్ని ఇచ్చే ఎరువులను చివరి దుక్కిలో వేసుకోవాలి. సెనగ వర్షాధారపు పంట. తేలికపాటి నీటి తడులు పెడితే సరిపోతుంది. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూత, కాయ దశల్లో తడులు అందించాలి.

అంతర కృషి..

విత్తే ముందు ఫ్లూక్లోరాలిన్ 45 శాతం మందును ఎకరాకు లీటరు చొప్పున పిచికారీ చేసి భూమిలో కలియదున్నాలి. లేదంటే పెండిమిథాలిన్ 30 శాతం మందును ఎకరాకు 1- 1.5 లీటర్లు చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజు గానీ పిచికారీ చేయాలి. విత్తిన 20-25 రోజుల తర్వాత గొర్రుతో అంతరకృషి చేయాలి. పంటకు పచ్చ, రబ్బరు పురుగుల బెడద ఉంటుంది. ఎండు తెగులు, వేరుకుళ్లు తెగుళ్లు సోకుతుంది. వీటి నివారణకు అందుబాటులో ఉండే వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. కోతకు వచ్చిన మొక్కలను పీకి ఆరబెట్టాలి. ఆరిన తర్వాత వారం రోజుల వరకు కుప్ప కట్టి ఉంచాలి. తర్వాత నూర్పిడి చేయాలి.

సాగుపై మక్కువ.. లాభాల ఆర్జన





నర్సింలు

ఆ యువకుడికి సాగంటే ఎంతో మక్కువ. డిగ్రీ పూర్తిచేశాక ఉన్నత విద్య చదివేందుకు వెళ్లకుండా ఇష్టమైన వ్యవసాయంపై దృష్టిసారించారు. అందులోనూ అందరిలా కాకుండా కాలానికి అనుగుణంగా పంటలు పండిసూ లాభాలు ఆర్జిస్తున్నారు. అతడే మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన సిందోల్ నర్సింలు. డిగ్రీ పూర్తయ్యాక సాగుపై ఇష్టంతో సంబంధిత విషయాలు తెలుసుకున్నారు. మెలకువలు నేర్చుకున్నారు. ఏ కాలంలో దేనికి డిమాండ్ ఉంటుందో గమనించారు. ఆయనకు మొత్తం 12 ఎకరాల పొలం ఉంది. ఏటా దసరా, దీపావళి పండగల సందర్భంగా మూడు నెలల ముందుగా ఎకరా పొలంలో బంతి సాగు చేస్తున్నారు. నారును హైదరాబాద్ నుంచి తీసుకొస్తున్నారు. పక్కాగా సస్యరక్షణ చర్యలు పాటిస్తున్నారు. నారింజ, పసుపు వర్ణాలకు సంబంధించిన పూలను పండిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలతో అవసరం మేర పురుగు మందులు వాడుతున్నారు. మూడు నెలల్లో మూడు కోతల మేర దిగుబడి వస్తోంది. నారు, కూలీలు, మందులు తదితర వాటికి రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. మూడు కోతల్లో 5 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. తద్వారా రూ.2 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. ఖర్చులన్నీ పోగా రూ.1.50 లక్షలు లాభం మిగులుతోంది. మిగతా సమయాల్లో కూరగాయలు పండిస్తున్నారు. – న్యూస్‌టుడే, పాపన్నపేట

పాటించు.. నివారించు..

కాకర పంటలో ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులతో ఆకుల మధ్య పచ్చగా మారి ఈనెలు ఉబ్బుతున్నాయి. బూజు తెగులు ఆశించి ఇలా జరుగుతుంది. ఆకులు సైతం కిందికి ముడుచుకుపోతాయి. దీని నివారణకు మెటలాక్సిల్, మాంకోజెబ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

తెల్లజొన్నలో విత్తనశుద్ధి కీలకం

యాసంగిలో రైతులు తెల్లజొన్న సాగు చేపడతారు. విత్తు దగ్గర నుంచి పంట చేతికొచ్చే వరకు సస్యరక్షణ చర్యలు చేపడితే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి సాధ్యమని తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం జొన్న పంట శాస్త్రవేత్త డాక్టర్ సుజాత తెలిపారు. నల్లరేగడి భూములు పంట సాగుకు అనుకూలం. మొక్కల వరుసల మధ్య దూరం అడుగున్నర, మొక్కకు మొక్కకు మధ్య అరడుగు దూరం పాటించాలి. పంట నాలుగు నెలల్లో చేతికొస్తుంది. విత్తనాలు నాటే ముందు శుద్ధి చేయాల్సిందే. కిలో విత్తనానికి 7మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 2గ్రా. థయామిథాక్సమ్‌ను కలిపి విత్తన శుద్ధి చేయాలి. లేదంటే నెల రోజుల్లో మొవ్వ తొలుచు పురుగులు ఆశిస్తాయి. – న్యూస్‌టుడే, తాండూరు

వనరుల సంరక్షణతోనే నీటి ఎద్దడి నివారణ



గ్రామస్థులతో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి


గొడిగార్‌పల్లి(కోహీర్), న్యూస్‌టుడే: జల వనరుల సమర్థ నిర్వహణతో భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్తులో ఎద్దడి నివారణ సాధ్యమవుతుందని జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ మాజీ ఉపాధ్యక్షుడు మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలం గొడిగార్‌పల్లి సమీపంలో కొన్నేళ్ల కిందట 'చతుర్విధ జల ప్రక్రియ' ద్వారా ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్ పథకం నిర్మాణాన్ని సోమవారం ఆయన పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమ్‌రెడ్డి, మాజీ సర్పంచి రాచయ్య తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన వేగం.. అదుపుతప్పిన వాహనం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



మల్లేశం



రసూల్‌ఖాన్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చిన ఓ యువకుడు మిత్రులను కలిసేందుకు ద్విచక్రవాహనంపై వేరే గ్రామానికి వెళ్లి, తిరిగి వస్తూ వేగాన్ని నియంత్రించలేక, ఆందోళనకు గురై రోడ్డు దాటుతున్న ఇద్దరిని ఢీకొట్టగా వారిలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. చివరకు వాహనాన్ని అదుపు చేయలేక తానూ కిందపడి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన సిద్దిపేటలో అదివారం అర్ధరాత్రి జరిగింది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన ముడికె మల్లేశం (32) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. దసరా పండుగకు సొంతూరికి నాలుగురోజుల కిందట వచ్చాడు. ఆదివారం స్నేహితులను కలుద్దామని, మిట్టపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లి, అదేరోజు అర్ధరాత్రి తిరుగు పయనమయ్యాడు. సిద్దిపేట రంగీలా దాబా చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న డ్రైవర్లు గణేశ్, రసూల్ ఖాన్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గణేశ్ గాయపడగా, రసూల్‌ఖాన్ (36) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో మరింత ఆందోళన గురైన మల్లేశం వాహన వేగం పెంచి, కొంత దూరం వెళ్లాక అదుపుతప్పి కిందపడి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న మల్లేశం సోదరుడు అక్కడికి చేరుకుని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మల్లేశానికి తల్లి, భార్య, కుమారుడున్నారు. రసూల్‌ఖాన్ స్వస్థలం కర్ణాటక బీదర్. ఆయన సోదరుడు అంజద్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

కారు బోల్తాపడి వృద్ధుడు..



నర్సయ్య

నార్సింగి(చేగుంట), న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి బోల్తా పడటంతో అందులో ఉన్న వృద్ధుడు మృతిచెందిన ఘటన నార్సింగి మండలం వల్లూరు వద్ద సోమవారం జరిగింది. స్థానిక ఎస్సై అహ్మద్ మొహినొద్దీన్ తెలిపిన వివరాలు.. మాసాయిపేట మండలం అచ్చంపేటకు చెందిన కత్తెర నర్సయ్య(70) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బంధువు యాదగిరి వైద్యం కోసం నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చాడు. కొన్ని పరీక్షలు హైదరాబాద్‌లో చేయించుకొని రావాలని వైద్యులు సూచించారు. దీంతో కొంపల్లికి వెళ్లి అక్కడ పరీక్షలు చేయించుకొని తిరిగి కారులో నార్సింగికి వస్తున్నారు. వల్లూరు దాటగానే కారు అదుపుతప్పి బోల్తాపడటంతో అందులో ఉన్న నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడిపిస్తున్న యాదగిరితో పాటు మరో వ్యక్తి గాయపడ్డాడు. వారిని చికిత్స నిమిత్తం నార్సింగిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

కుంటలో పడి యువకుడు..



నితిన్

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో కుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేట శివారులో సోమవారం జరిగింది. పట్టణ మూడో ఠాణా సీఐ విద్యాసాగర్ తెలిపిన ప్రకారం సిద్దిపేట పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన పేర్ల నితిన్(22)కు ఏడాది కిందట పోస్టుమాస్టర్ ఉద్యోగం వచ్చింది. జగదేవపూర్ మండలం చాట్లపల్లిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం మిత్రుడు రోహిత్‌తో కలిసి ఇంటినుంచి బయటకు వెళ్లి, రాత్రైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా, తాత పెంటయ్య వద్ద ఉన్నానని సమాధానం ఇచ్చాడు. సోమవారం ఉదయం ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. అనుమానంతో కుటుంబ సభ్యులు నితిన్ ఆచూకీ కోసం వెతుకుతుండగా, పట్టణ శివారులోని తిమ్మికుంట వద్ద అతని చెప్పులు కనిపించాయి. కుంటలో వెతికించగా మృతదేహం లభ్యమైంది. నితిన్‌కు తల్లి లక్ష్మి, తండ్రి రాజు, సోదరి ఉన్నారు. మృతిపై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదైందని సీఐ తెలిపారు.

తల్లి ఆస్తి పంచివ్వలేదని.. తనయుడి బలవన్మరణం

హత్నూర, న్యూస్‌టుడే: తనకు రావాల్సిన భూమి వాటాను తల్లి పంచివ్వడం లేదన్న మనస్తాపంతో కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. మండల పరిధి దేవులపల్లిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. దేవులపల్లికి మహ్మద్ మహబూబాకు షఫీ, యాదుల్లా కుమారులు. సోదరులిద్దరు వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. ఉమ్మడి ఆస్తికి చెందిన భూమి తల్లి పేరిట ఉంది. షఫీ చిన్న కూతురి వివాహం నిశ్చితార్థమయింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. తనకు రావాల్సిన భూమి వాటాను పంచివ్వాలని తల్లిపై ఒత్తిడి తెచ్చాడు. ఆమె ససేమిరా అనడంతో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనోవేదనకు గురైన షఫీ గ్రామ సమీపంలోని ఎర్రకుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. షఫీ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చెరువులో దూకి మరొకరు..



మల్లికార్జున్

శివ్వంపేట, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లుట్ల గ్రామానికి చెందిన లెంకల మల్లికార్జున్ (40) మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో భార్య మాధవితో గొడవపడి దసరా రోజు శనివారం పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దసరా రోజు గ్రామస్థులకు చెరువు వద్ద కనిపించిన మల్లికార్జున్ అప్పటి నుంచి ఆచూకీ లేదు. సోమవారం చెరువు వద్ద చూడగా ఆయన మృతదేహం లభించింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదైంది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పాముకాటుతో మహిళ మృత్యువాత



జ్యోతి

శివ్వంపేట, న్యూస్‌టుడే: పాముకాటుకు గురైన మహిళను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. శివ్వంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన గేడి జ్యోతి(28) ఆదివారం సాయంత్రం ఇంటి దగ్గర గేదెలకు గడ్డివేసే క్రమంలో పాము కాటు వేసింది. వెంటనే కామారెడ్డి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. జ్యోతికి భర్తతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

మల్లన్నసాగర్ నిర్వాసితులకు అండగా ఉండాలి

గజ్వేల్, న్యూస్‌టుడే: మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం ఆయన గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలపై దృష్టి సారించటం లేదన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియాలోని సంగాపూర్ వద్ద ఏర్పాటు చేసిన కాలనీల్లో ఉంటున్న వారికి కనీస సౌకర్యాలు లేవన్నారు. చివరి మజిలీ సౌకర్యం శ్మశానవాటిక ఏర్పాటు చేయలేదన్నారు. రెండున్నరేళ్లుగా ఐదారు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు.

మద్యం తాగి పట్టుబడిన వారికి జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు సోమవారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ.21,500 జరిమానా విధించారు.

'ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయడం తగదు'

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేస్తుండటంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ నిరుద్యోగ ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శివరామకృష్ణ అన్నారు. సిద్దిపేటలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రవర్ణాలకు చెందిన కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఈడబ్ల్యూఎస్ కోటా సాధించుకున్నారని తెలియజేశారు. ఆయన వెంట శ్రీనివాస్, శేఖర్‌కుమార్, కనకయ్య తదితరులు ఉన్నారు.

ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: గ్రామంలో చిన్న చిన్న సంఘటనలు జరిగినప్పుడు అందరూ ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని ఏసీపీ మధు సూచించారు. నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులతో సోమవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతి, మతం, కుల వర్గ బేధాలు లేకుండా అందరూ కలిసి జీవించాలన్నారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. ఇటీవల కాలంలో ఏ చిన్న సంఘటన జరిగినా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని, ఇది సరికాదన్నారు. యువత ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు సాగాలని, ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఐ శ్రీను, ఎస్సైలు బాలకృష్ణ, అసిఫ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తడి.. పొడి.. తడబడి

● పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానం

దుబ్బాక, న్యూస్‌టుడే: స్వచ్ఛ పురపాలికే లక్ష్యంగా దుబ్బాక పట్టణంలో చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్త డబ్బాల నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని చోట్ల డబ్బాలు మాయమవుతున్నాయి. పురపాలక సిబ్బంది వీటి విషయంలో పర్యవేక్షణ చేయకపోవడంతో పారిశుద్ధ్యం అటకెక్కింది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పురపాలికలోని 20 వార్డుల ఇళ్లలోని చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా ఉండేందుకు 10 నెలల క్రితం ప్రధాన కూడళ్ల వద్ద తడి, పొడి, హానికర చెత్త వేసేందుకు మూడు డబ్బాలను పురపాలిక అధికారులు ఏర్పాటు చేశారు. సుమారు రూ.70 వేల ఖర్చుతో ప్రధాన కూడళ్ల వద్ద సిమెంట్ దిమ్మెలు నిర్మించి దానిపై ఇనుప కొక్కెలను ఏర్పాటు చేశారు. ప్రతి చోట ఆకుపచ్చ(తడి చెత్త), నీలం(పొడి), ఎరుపు(హానికర చెత్త) డబ్బాలు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజలు రోజు వారీ చెత్తను అందులో వేసేవారు. పురపాలిక వాహనం వచ్చి మూడు డబ్బాల్లోని చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించేవారు.



తపాలా కార్యాలయ ఆవరణలో పొదల మధ్య చెత్త డబ్బాలు

ఆరు నెలలుగా అస్తవ్యస్తం

పట్టణంలో 6 నెలలుగా చెత్త డబ్బాల నిర్వహణ చాలా అధ్వానంగా మారింది. పర్యవేక్షణ లేక పలు చోట్ల డబ్బాలు, వాటి మూతలు విరిగిపోయాయి. కొన్నింటిని పక్కన పడేశారు. స్థానిక పోస్టాఫీస్ వద్ద ఏర్పాటు చేసినవి పిచ్చి మొక్కల మధ్య పడేశారు. వెజ్ అండ్ నాన్‌వెజ్ కూరగాయల మార్కెట్ వద్ద డబ్బాలు విరిగిపోయాయి. దీంతో వ్యాపారులు పాడైన, కుళ్లిన కూరగాయలను అక్కడే నేలపై పడేసి వెళుతున్నారు. ఎస్సీ కాలనీల్లో డబ్బాలు, మూతలు విరిగి పోయాయి. డబ్బాలు లేక ఖాళీ ఇనుప కొక్కెలు దర్శనమిస్తున్నాయి. బస్టాండు ప్రాంగణంలో వ్యర్థాలను నేలపైనే వేస్తున్నారు.

మూలకు చేరిన వాహనాలు

పారిశుద్ధ్య సిబ్బంది కొరతతో పట్టణంలో ప్రతి రోజు పలు వార్డుల్లోకి రావాల్సిన చెత్త సేకరణ వాహనాలు మూడు, నాలుగు రోజులైనా రావడం లేదు. పురపాలికలో ప్రస్తుతం 9 వాహనాలు ఉండగా మూడు పాడై మూలన చేరాయి. ఫలితంగా చెత్త సేకరణ వాహనాలు సక్రమంగా రాక, తడి, పొడి చెత్త డబ్బాలు లేక, ప్రజలు రహదారులపై వ్యర్థాలు వేసి పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు.

కొత్తవి ఏర్పాటు చేయిస్తాం

-రమేశ్‌కుమార్, పుర కమిషనర్

పట్టణంలో మూలకు చేరిన చెత్త డబ్బాలను తొలగిస్తాం. వాటి స్థానంలో కొత్తవి వాహనాలను మరమ్మతులు చేయించి ప్రతి రోజు వార్డుల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం.



ఎస్సీ కాలనీలో డబ్బాలు లేక ఇలా..

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట టౌన్ 9963585053
జగదేవపూర్ 8008573209
మద్దూరు 8008573520
దుబ్బాక 9030037175
చేర్యాల 8008574871
గజ్వేల్ 9490675047
(10AM TO 1 PM)

-న్యూస్‌టుడే, జగదేవపూర్

? జగదేవపూర్ బస్టాండులో ఓ మురుగు కాల్వ మ్యాన్‌హోల్ నోరు తెరుచుకుని ప్రమాదకరంగా మారింది. ప్రయాణికులు అజాగ్రత్తగా రాకపోకలు సాగిస్తే అందులో పడే అవకాశం ఉంది.
-రాచకొండ యాదగిరి, జగదేవపూర్

✓ క్షేత్రస్థాయి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.
-సతీష్, పంచాయతీ కార్యదర్శి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఓ పాఠశాల పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2000-2001 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులంతా ఓ వేదిక మందిరంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఘనంగా నిమజ్జన శోభాయాత్ర



సిద్దిపేటలో అమ్మవారు

చిన్నకోడూరు: చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కానుకలు సమర్పించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఊరేగింపు జరిగింది. అనంతరం గ్రామాల్లోని సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.



చేర్యాల, సిద్దిపేటలో కళాకారుల కోలాట ప్రదర్శన



చిన్నకోడూరు పెద్దచెరువులో అమ్మవారి నిమజ్జనం



చేర్యాల: దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా చేర్యాల పట్టణం చావిడి వద్ద దేవి స్నేహ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. నెత్తిన బోనాలు, కోలాటాలతో కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

సిద్దిపేట టౌన్: పట్టణంలో అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర కనులపండువగా సాగింది. వివిధ కాలనీల్లో పలు అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం దుర్గామాత విగ్రహాలను కోమటిచెరువులో నిమజ్జనం చేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

పాపన్నపేట: మండల పరిధి బాచారం ఉమా సంగమేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ అనంతరం కల్యాణం, హోమం చేశారు. అర్చకులు విశ్వనాథశర్మ, నాయకులు వెంకట్ రాములు, దుర్గయ్య, రాము, వెంకట్ పాల్గొన్నారు.

'బోధనా రుసుములు రాక విద్యార్థులకు కష్టాలు'

గజ్వేల్, న్యూస్‌టుడే: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని.. బోధనా రుసుములు విడుదల చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆయన సోమవారం గజ్వేల్‌లో మాట్లాడుతూ.. ఉపకారవేతనాలు, బోధనా రుసుముల బకాయిలు పేరుకున్నాయన్నారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజు కోసం ఒత్తిడి తెస్తున్నాయన్నారు. కొందరు కళాశాలలను మూసేస్తామంటున్నారన్నారు. యాజమాన్యాలతో చర్చించి విద్యాసంవత్సరాన్ని కాపాడాలని కోరారు. సంఘం ప్రతినిధులు మధు, శేఖర్, రాకేశ్, రవి, రాజేశ్, రవితేజ, సురేందర్ తదితరులున్నారు.

మాలల హక్కుల సాధనకు ఉద్యమం

మిరుదొడ్డి: పార్టీలకు అతీతంగా మాలల హక్కుల సాధనకు ఉద్యమించాలని మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో ఛైర్మన్ ర్యాకం శ్రీరాములు పేర్కొన్నారు. సోమవారం అక్బర్ పేట్-భూంపల్లి మండల కేంద్రంలో మాల సామాజిక వర్గానికి సంబంధించిన సభ్యులతో కలిసి మాట్లాడారు.. ఈ నెల 25న భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి 10 జిల్లాల్లోని 43 నియోజక వర్గాల గుండా పాదయాత్ర కొనసాగనుందన్నారు. యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిశోర్, శ్రీనివాస్, యాదగిరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అలయ్ బలయ్‌తో ఐక్యత

నర్సాపూర్: అలయ్ బలయ్ కార్యక్రమం ద్వారా ఆర్యవైశ్యుల్లో ఐక్యత పెంచాలని సంఘం జిల్లా మహాసభ అధ్యక్షుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గుప్తా సూచించారు. నర్సాపూర్‌లోని రైస్ మిల్లర్ల సంఘం కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలిసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధ్యమన్నారు. గౌరవాధ్యక్షుడు నోముల శ్రీను, కోశాధికారి హరీష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి మల్లేశం పాల్గొన్నారు.

నేటి నుంచి టీకాలు

కౌడిపల్లి: మండలంలో ఈనెల 15 నుంచి వచ్చేనెల 14 వరకు నెల రోజుల పాటు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి రాజు తెలిపారు. సోమవారం ఈ విషయమై విలేకరులతో మాట్లాడారు. అన్ని గ్రామాలు, తండాల్లో సిబ్బంది వచ్చి టీకాలు వేస్తారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్తు అధికారుల బదిలీ

తూప్రాన్, న్యూస్‌టుడే: విద్యుత్తు డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు బదిలీ అయ్యారు. సోమవారం తూప్రాన్ కొత్త డీఈగా గరట్‌మంతరాజు, ఏడీఈగా టి.శ్రీనివాస్, ఏఈగా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. సిబ్బంది వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, షాదుల్ హుసేన్, జీవన్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింలు, ముత్యాలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో ఆభరణాల చోరీ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి బంగారు, వెండి అభరణాలను ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట గ్రామీణ ఠాణా ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట గ్రామీణ మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన కోరే దేవయ్య కుటుంబ సభ్యులు బంధువుల ఇంట్లో వేడుక నిమిత్తం ఈ నెల 12న ఇంటికి తాళం వేసి వెళ్లారు. 13న వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువా తీసి సుమారు 7 తులాల బంగారు ఆభరణాలు, 90 తులాల వెండి నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. దేవయ్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

దాబా, పాఠశాలలో..

నిజాంపేట(రామాయంపేట), న్యూస్‌టుడే: తాళం పగలగొట్టి దాబాలోని కౌంటర్‌లో ఉంచిన నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నిజాంపేట మండలం చల్మెడకు చెందిన మంగిపల్లి స్వామి గ్రామ శివారులోని కమాన్ వద్ద దాబా నిర్వహిస్తున్నాడు. దసరా రోజు పూజలు చేసి తాళం వేసి ఇంటికెళ్లాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు తాళం పగలగొట్టి కౌంటర్‌లో ఉంచిన రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం స్వామి ధాబాకు రాగా.. చోరీ విషయం వెలుగుచూసింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదైంది. అలాగే నిజాంపేట ప్రాథమిక పాఠశాలలో గది తాళం పగలగొట్టి టీవీ ఎత్తుకెళ్లారు.

దోమపోటుతో పంటకు నష్టం

చేగుంట, న్యూస్‌టుడే: వరి పైరుకు దోమపోటు వ్యాప్తి చెంది నష్టం చేస్తోందని ఏవో హరిప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని చిట్టోజీపల్లిలో వానాకాలంలో సాగుచేసిన వరిపైరుకు సోకిన దోమను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమను గమనించిన వెంటనే పైరు మొత్తం ఆరబెట్టాలన్నారు. అవసరమైన క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం కొండపాక మండలం రాంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. క్వింటా ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2320, సాధారణ గ్రేడ్ రకానికి రూ.2300 లభిస్తుందన్నారు. సన్నధాన్యం కింటాకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పోతారం(ఎస్)లో ఆర్డీవో రామ్మూర్తి..



రాంపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య

చేర్యాల(మద్దూరు): మద్దూరు మండలం వంగపల్లి, కొమురవెల్లి మండలం గౌరాయపల్లిలో కొనుగోలు కేంద్రాలను వ్యవసాయాధికారులు రామకృష్ణ, కె.వెంకటరామమ్మ తదితరులు ప్రారంభించారు.

హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం: ఆర్డీవో రామ్మూర్తి హుస్నాబాద్ విపణి, అక్కన్నపేట మండలం అంతకపేట, హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో జిల్లా పౌర సరఫరాల అధికారి తనూజతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తహసీల్దార్లు రవీందర్‌రెడ్డి, అనంతరెడ్డి, ఎంపీడీవో జయరాం తదితరులు పాల్గొన్నారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి, గుబ్బడి గ్రామాల్లో ప్రాథమిక సహకార సంఘం ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య ప్రారంభించారు.

గజ్వేల్ గ్రామీణ, ములుగు, జగదేవపూర్: గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో, మర్కుక్ మండలం ఎర్రవల్లిలో, జగదేవపూర్ మండల పరిధి చాట్లపల్లి ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను గజ్వేల్ ఏఎంసీ ఛైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి ప్రారంభించారు.

చిన్నకోడూరు, సిద్దిపేట అర్బన్: చిన్నకోడూరు తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీవో జనార్దన్ చిన్నకోడూరు మండలంలోని రామంచ, నారాయణరావుపేట మండలం కోదండరావుపల్లిలో ఎంపీడీవో శ్రీరాములు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.



పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సాకి ఆనంద్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు.
-న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గం

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపూర్ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా బోనగిరి రమేష్, ఉపాధ్యక్షులుగా బోనగిరి ప్రభాకర్, బోనగిరి రాజు, ప్రధాన కార్యదర్శిగా సునీల్, సహాయ కార్యదర్శులుగా రత్నాకర్, అరుణ్, కోశాధికారిగా శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా బాలయ్య, దుర్గయ్య, నర్సయ్య, సభ్యులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

27న స్వేరోస్ జాతీయ సదస్సు

వర్గల్, న్యూస్‌టుడే: బెజ్జంకి మండల కేంద్రంలో ఈ నెల 27న స్వేరోస్ జాతీయ సదస్సు జరగనుందని వర్గల్ మండల స్వేరోస్ అధ్యక్షుడు సురేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సభ్యులతో కలిసి సోమవారం గోడపత్రికలు ఆవిష్కరించారు.

భూగర్భ జలాల వృద్ధి.. ఆయకట్టు పెరిగి



న్యూస్‌టుడే, చేర్యాల: కనుచూపు మేరకు పచ్చని వరి పొలాలే కనిపిస్తున్న ఈ దృశ్యం కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల శివారులోనిది. తపాసుపల్లి జలాశయంతో భూగర్భజల మట్టం మెరుగైంది. దీనికి తోడు ఏటా గోదావరి జలాలతో చెరువులు నింపడం, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆయకట్టు ప్రాంతాలన్నీ సాగులోకి వచ్చాయి. మండలంలో ఐదారేళ్ల క్రితం వెయ్యి ఎకరాల్లోపే సాగైన వరి, ఇటీవల సుమారు 2 వేల ఎకరాల్లో సాగవుతోంది. దీంతో ఇలా పలు ప్రాంతాల్లో పచ్చని పైర్లు దర్శనమిస్తున్నాయి.

ఆసుపత్రుల్లో రికార్డులు, ఔషధాల పరిశీలన



వెల్‌నెస్ కేంద్రంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంహెచ్‌ఎన్ పీవో ఆనంద్

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని వెల్‌నెస్ కేంద్రం, ఇందిరమ్మ కాలనీలోని బస్తీ దవాఖానాను జిల్లా ఎంహెచ్ఎన్ (మెటర్నల్ హెల్త్ అండ్ న్యూట్రీషియన్) ప్రోగ్రాం అధికారి ఆనంద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులు, ఔషధాలను పరిశీలించారు. సమయ పాలన, నిర్వహణ, నిత్యం సేవలు సద్వినియోగం చేసుకుంటున్న రోగుల సంఖ్య, వెల్‌నెస్ కేంద్రంలో వివిధ విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని సూచించారు.

లక్ష్యానికి మించి సభ్యత్వాలకు కృషి

నర్సాపూర్: లక్ష్యానికి మించి సభ్యత్వాలకు కృషి చేస్తున్నామని ఆ పార్టీ సభ్యత్వ సేకరణ జిల్లా బాధ్యుడు మురళీధర్‌గౌడ్ అన్నారు. నర్సాపూర్‌లో సోమవారం సభ్యత్వ నమోదును పరిశీలించి మాట్లాడారు. నేతలు మురళీయాదవ్, రమణారావు, రాజేందర్, కవితారెడ్డి, రమేశ్, శ్రీకాంత్, అంజీగౌడ్ పాల్గొన్నారు

ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరని లోటు

చేర్యాల, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, పౌర స్వేచ్ఛ సమాజానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుడైన ఆయన్ను ఏడేళ్లు జైలులో నిర్బంధించడం అన్యాయమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భూమయ్య, సుదర్శన్, సురేందర్, మహేశ్, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ తెలంగాణ ఐకాస ప్రతినిధులు ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి అర్పించారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, వీరన్నయాదవ్, కొమురయ్య, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నాయకులు బత్తుల చంద్రమౌళి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట పట్టణంలో దేవి శోభాయాత్ర నిర్వహించే క్రమంలో పలువురు యువకుల మధ్య తగాదా ఘర్షణకు దారితీసింది. నల్లపోచమ్మనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు... కాలనీలో ఓ యువజన సంఘం అమ్మవారి ప్రతిష్ఠించి ఆదివారం రాత్రి నిమజ్జనానికి సిద్ధమైంది. శోభాయాత్ర ప్రారంభించగా మరో కాలనీకి చెందిన కొందరు యువకులు అక్కడికి వచ్చి నృత్యాలు చేయబోయారు. మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు బాహాబాహీకి దిగారు. పిడిగుద్దులు కురిపించుకున్నారు. ఈ ఘర్షణలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

గీత కార్మికుడి అదృశ్యం

చేర్యాల(ధూల్మిట్ట), న్యూస్‌టుడే: ధూల్మిట్ట మండలం బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి అదృశ్యమైనట్లు మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గత కొన్నాళ్లుగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతున్నాడు. రోజూ తాగి ఇంటికి వస్తున్నావని అతని భార్య లక్ష్మి ఆదివారం నిలదీయడంతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తీరనున్న రహదారి కష్టాలు

వంతెన నిర్మాణానికి ప్రతిపాదన!

న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం: శనిగరం నుంచి కోహెడ వరకు ఇటీవల రెండు వరుసల దారి పూర్తయింది. తంగళ్లపల్లి నుంచి గుండారెడ్డిపల్లి మీదుగా నంగునూరు మండలంలోని బద్దిపడగ వరకు 8 కిలోమీటర్ల ఏక వరుస దారి ఉంది. తంగళ్ళపల్లిలో అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.180 కోట్లతో నిర్మించబోతున్న పాఠశాలతో రెండు వరుసల దారిగా మారనుంది. ఇన్నాళ్లు మూలమలుపులు, ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు పడ్డ వాహనదారుల కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు.



ఇటీవల కురిసిన వర్షాలకు గుండారెడ్డిపల్లిలో వంతెన మీదుగా వరద ప్రవాహం

మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనతో..

పాఠశాల నిర్మాణంతో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందనుంది. మరోవైపు వాహనదారుల కష్టాలతో పాటు గుండారెడ్డిపల్లిలో ప్రమాదకరంగా మారిన బ్రిడ్జికి మంచి రోజులు రాబోతున్నాయి. వాగు పారిన ప్రతిసారి బ్రిడ్జి మీదుగా ప్రవాహం కొనసాగేది. ఏళ్లు గడుస్తుండడంతో శిథిలావస్థకు చేరుతోంది. ఈ క్రమంలోనే కొత్త వంతెన నిర్మాణం ఉంటుందని పాలకులు సంకేతాలు ఇచ్చారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే పాఠశాల కారణంగా రవాణా పెరుగుతుంది. అందులో భాగంగా ఇక్కడి రోడ్డును రెండు వరుసలుగా చేపట్టాల్సిన అవసరం ఉందని ఆర్ అండ్ బీ అధికారులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించిన విషయం తెలిసిందే. ఇది అనుకున్న ప్రకారం పూర్తయితే బద్దిపడగలోని నాలుగు వరుసల దారికి కలుస్తుంది.

మంత్రి సూచనతో...

-సాజిద్, ఆర్ అండ్ బీ ఏఈ, కోహెడ

తంగళ్ళపల్లి మీదుగా గుండారెడ్డిపల్లి బద్దిపడగ వరకు 8 కిలోమీటర్ల ఏక వరుస తారు రోడ్డు ఉంది. మంత్రి సూచనతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.